శిథిలావస్థలో విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-పెదబయలురూరల్:మండలంలోని మారుమూల గ్రామమైన లింగేటి పంచాయతీ మగ్గంవీధి గ్రామంలో శిథిలావస్థలో విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. దీంతో, ఏ క్షణంలో పడిపోతాయోననే భయంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గాలి, వాన వస్తే, స్తంభాలు ఊగి పోతుండటంతో ఆందోళన చెందుతున్నారు.విద్యుత్ శాఖ చొరవ తీసుకొని నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన గిరిజనులు డిమాండ్ చేశారు.

దెబ్బతిన్న స్తంభాన్ని చూపుతున్న గ్రామస్తులు

సమస్యలు పరిష్కరించాలని టూరిజం కార్మికుల నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి:పర్యాటకశాఖలో పని చేస్తున్న కార్మికులతో కుదుర్చుకున్న న్యాయపరమైన ఒప్పంద డిమాండ్లను తక్షణమే పరిష్కారం చేయాలని, లేకుంటే ఈనెల 22వ తేదీ నుండి సమ్మె బాట తప్పదని అల్లూరి జిల్లా ప్రముఖ పర్యాటక పలు యూనిట్‌లలో పని చేస్తున్న కార్మిక యూనియన్లు విశాఖ జిల్లా రీజినల్ మేనేజర్, యూనిట్ల మేనేజర్లను కలిసి సమ్మె నోటీసులు సమర్పించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా గురువారం మధ్యాహ్న భోజన విరామం సమయం అనంతరం కార్మికులు నల్లబ్యాడ్జీలతో అనంతగిరి హరిత హిల్, టైడా, అరుకు, బొర్రా గుహలు, చింతపల్లి, లంబసింగ్, తదితర యూనిట్ల ముఖద్వారం వద్ద నిరసన చేపట్టి నినాదాలు చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గతంలో తమ కార్మిక సంఘాలతో కుదుర్చుకున్న కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని, లేకుంటే ఈనెల 22వ తేదీ నుండి పర్యాటకశాఖ యూనిట్లు మూసివేసి సమ్మె బాట తప్పదని వారు స్పష్టం చేశారు. పర్యాటక శాఖను నమ్ముకుని ఏళ్ల తరబడి వెట్టిచాకిరి పనులు చేస్తూ చాలీ చాలని వేతనాలతో తమ కుటుంబ పోషణం చేస్తున్నామన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మండల కార్మిక యూనియన్ ప్రతినిధులు నరసింహారాజు, సోమేష్, నగేష్, బుద్దరాజు డిమాండ్ చేశారుఉ. ఈ కార్యక్రమంలో అనంతగిరి, అరకు పలు మండలాల యూనిట్లలో పని చేస్తున్న కార్మికులు పాల్గొన్నారు

టూరిజం అతిథి గృహాల ముందు నినాదాలు చేస్తున్న కార్మికులు

అరకు లోయ :అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఉన్న ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్‌లో వివిధ కేటగిరీలో పని చేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22 నుంచి సమ్మె బాట పట్టనున్నట్లు ఏపీ టూరిజం కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, డైలీ వేస్, వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు డి గంగరాజు, బాబురావు, అంజలి రావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, టూరిజం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గతంలో అనేకమార్లు టూరిజం యాజమాన్యం, టూరిజం ప్రిన్సిపల్ సెక్రెటరీ, మేనేజింగ్ డైరెక్టర్, అప్పటి ఎస్సీ, ఎస్టి కమిషన్ దృష్టికి తీసుకెళ్లి వారి సమక్షంలో విజయవాడ సెక్రటేరియట్‌లో ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ నుంచి రివ్యూ మీటింగ్ చేయడం జరిగిందన్నారు. అయినప్పటికి నేటికీ సంవత్సరాలు గడుస్తునా ఒక్క డిమాండ్ కూడా నెరవేర్చ లేదన్నారు. ఎన్నోసార్లు విజయవాడ హెడ్ ఆఫీస్ కు వెళ్లి విన్నపించినా యాజమాన్యం కనీసం స్పందన లేకపోవడంతో కార్మికులంతా ఈ నెల 22 నుంచి సమ్మెలోనికి వెళ్లడానికి నిర్ణయించు కున్నామన్నారు.ఇప్పటికైనా టూరిజం యాజమాన్యం కార్మికుల సమస్యలను తక్షణమే స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఇందులో భాగంగానే గురువారం టూరిజం అతిథి గృహాల ముందు కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జి ధరించి నిరసన తెలియజేశారు. సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

బొర్రా గుహ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

మాట్లాడుతున్న ఎంపిటిసి బుజ్జిబాబు, చిత్రంలో గిరిజన సంఘం, సిఐటియు నేతలు

విద్యార్థుల వెట్టిచాకిరీకి అధికారులదే బాధ్యత

- తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- హాస్టళ్లలో పూర్తి స్థాయిలో వర్కర్లను నియమించాలి

- గాలికొండ ఎంపిటిసి బుజ్జిబాబు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు వెట్టిచాకిరీ (పనులు) చేయడానికి ప్రధాన కారకులు అధికారులేనని గాలికొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో పూర్తిస్థాయిలో వంట కుక్కులు (వర్కర్లు) లేకపోవడం వల్లనే విద్యార్థులు పనులు చేయవలసిన దుస్థితి నెలకొందన్నారు. ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు, వర్కర్లను నియమించడంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమైనట్లు విమర్శించారు. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేక విద్యాబోధన అగమ్య గోచరంగా ఉందని, వర్కర్లు లేక విద్యార్థుల చేత పనులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. జీకే వీధి మండలం రింతాడ ఆశ్రమ పాఠశాలలో ఇటీవల విద్యార్థులచే బయటి నుంచి మంచినీళ్లు మోయించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేసిన ఘటన మరువకముందే దారకొండ బాలుర ఆశ్రమ పాఠశాలలో గ్యాస్ సిలిండర్లు, బియ్యం బస్తాలు విద్యార్థులచే మోయించిన దృశ్యాలు బయటకొచ్చాయని తెలిపారు. ఆశ్రమ పాఠశాలలను పర్యవేక్షించాల్సిన ఎటిడబ్ల్యుఒకు అదనపు బాధ్యతలు ఉండడంతో పర్యవేక్షణ కొరవడిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఐటిడిఎ పిఒ అభిషేక్ స్పందించి అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు ఉపాధ్యాయులు, వర్కర్లను పూర్తిస్థాయిలో నియమించాలని, ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల చేత పనులు చేయించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కొర్ర బాలయ్య, కార్యదర్శి మురళ చంటి, సిఐటియు మండల కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ, బాబురావు, కొండబాబు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

-కాఫీ రైతుల సంఘం జాతీయ అధ్యక్షులు చిన్నబాబు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:కాఫీ రైతులకు గిట్టు బాటు ధర కల్పించాలని కాఫీ రైతుల సంఘం జాతీయ అధ్యక్షులు జి.చిన్నబాబు డిమాండ్ చేశారు. గురువారం ఆదివాసీ గిరిజన భవనంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీ 11 మండలల్లో కాఫీ పళ్ళు కోత ముమ్మరంగా మొదలైందని, ప్రభుత్వమే జీసిసి సంస్థ ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం కాఫీ పళ్ళ సీజన్ రాకుండా ముందే ఆగస్టు నెలలోనే ధర ప్రకటించిన ఐటిడిఏ అధికారులు ఈ ఏడాది పళ్ళ కోత సీజన్ ప్రారంభం అయినా కూడా ధర ప్రకటించక దారుణమన్నారు. దీంతో, రైతులకు ధరలు తెలియక, ప్రభుత్వం కొనుగోలు చేయక పోవడంతో దళారుల చేతుల్లో మోస పోతున్నారనిన్నారు. తక్షణమే దళారు వ్యవస్థను అరికట్టాలన్నారు. గతంలో కిలో పార్చిమెంట్ కాఫీ రూ.270, చెర్రీ రూ.135లకు కొనుగోలు చేసారని ఈ సంవత్సరం కనీసం కిలో కాఫీ పళ్ళు పచ్చివి రూ.100లకు, పార్చిమెంట్ రూ.500లకు, చెర్రీ కాఫీ రూ.270లకు కొనుగోలు చేయాలన్నారు. ప్రయివేట్ సంస్థలైన నాంది కూడా కిలో పళ్ళ కాఫీ రూ.100లకు తగ్గకుండా కొనుగోలు చేయాలన్నారు. అరకు ఆర్గానిక్ కాఫీకి దేశ విదేశాల్లో సైతం మంచి పేరు, ధర ఉందని పండించే రైతుకు మాత్రం కనీస గిట్టు బాటు ధర కల్పించలేదని అన్నారు. రైతులకు బకాయి పడ్డ 60కోట్ల డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది కాఫీ పంట వేసుకున్న రైతులకు చెల్లించాల్సిన డబ్బులు తక్షణమే రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. జిసిసి సంస్థ రైతులకు వడ్డీ లేని రుణాలు రూ.50,000 ఇవ్వాలని, ప్రతి రైతుకు పల్పింగ్ మిషన్, ఇండివిడ్యుయల్, అల్యూమినియం, నిచ్చెనలు, ఆర్గానిక్ సర్టిఫికెట్ ప్రతి రైతుకు ఇవ్వాలన్నారు. రైతులకు నేరుగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించక పోతే కాఫీ రైతులతో ఐటిడిఏ వద్ద ఆందోళన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాఫీ రైతుల మండల కార్యదర్శి గురుమూర్తి, ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షులు జి.బుజ్జి బాబు, నానిబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిన్నబాబు

సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యాన యువతకు వాలీ బాల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండలంలో మారుమూల పంచాయతీలైన కుమడ, బూసిపుట్టు పరిధిలో స్థానిక ఎస్సై రవీంద ఆధ్వర్యాన సిఆర్పిఎఫ్ బెటాలియన్స్ పర్యటించాయి. .గిరిజనులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అసాంఘిక కార్యకలాపాలలో యువత పాల్గొన వద్దని ఎస్ఐ సూచించారు. ప్రలోభాలకు గురై అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొనడం చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి సాగు, రవాణా, పైలెటింగ్ తదితర కార్యకలాపాలలో యువత అధికంగా మొగ్గు చూపుతుందని, ఇది చట్టరీత్యా నేర మన్నారు.సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పులబండ, కెందుగూడ, సుల్తాన్‌పుట్‌లో తాగునీటి సమస్య అధికంగా ఉందని స్థానిక ఎస్సై రవీంద్రకు ప్రజలు తెలిపారు. యువతకు వాలీ బాల్‌కిట్‌లను స్థానిక ఎస్సై రవీంద్ర ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

కిట్లును అందజేస్తున్న సిఆర్‌పిఎఫ్ పోలీసులు

కినపర్తి పంచాయతీపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని కినపర్తి పంచాయతీ పట్ల అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం తగదని ఆ పంచాయతీ సర్పంచి రీమల శ్రీనివాస్ పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కినపర్తిలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో శ్రీనివాస్ మాట్లాడుతూ కినపర్తి పంచాయతీ పట్ల పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఎటువంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజాప్రతినిధులు చొరవచూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాగునీటి సౌకర్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

తిగలవలస సచివాలయం

డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించరూ...

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని తిగలవలస పంచాయతీలో డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని పంచాయతీ గ్రామ ప్రజలు కోరుతున్నారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేక పోవడంతో క్యాస్ట్, ఇన్కమ్, వన్ బి, మ్యూటెషన్, పట్టా పాస్ బుక్స్, చలనా ప్రభుత్వ పరమైన తదితర సేవలు అందుబాటులో లేక పంచాయతీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. . తీగలవస పంచాయతీ పరిధిలోని 24 గ్రామాలు ఉన్నాయి. డిజిటల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉండటంతో తాత్కాలికంగా వెల్ఫేర్ అసిస్టెంట్ చూస్తున్నారు.ఐటీడీఏ అధికారులు స్పందించి డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సత్యసాయి వాటర్ వర్కర్లకు 18 నెలల బకాయి వేతనాలు చెల్లించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి ఏరియాలో దాదాపు 150 గ్రామాలకు మంచినీరు అందిస్తున్న సత్యసాయి వాటర్ స్కీంలో పనిచేస్తున్న వర్కర్లకు 18 నెలల నుండి వేతనాలు పెండింగ్లో ఉన్నాయని, తక్షణమే ఆ వేతనాలను చెల్లించాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. మారేడుమిల్లిలో గురువారం జరిగిన సిఐటియు మండల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకట్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో సత్యసాయి వాటర్ పథకం ద్వారా ప్యూరిఫైడ్ వాటర్‌ని గిరిజన ప్రజలకు ఇస్తూ వారి ఆరోగ్యాలు కాపాడుతున్నారని తెలిపారు. అటువంటి స్కీమ్‌లో పని చేస్తున్న వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. సత్యసాయి వాటర్ స్కీమ్ కాంట్రాక్టర్‌ను వేతనాలు చెల్లించమంటే ప్రభుత్వం బిల్లు చెల్లించలేదని అంటున్నారని, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను అడిగితే ప్రభుత్వం బడ్జెట్ కేటాయించట్లేదని చెబుతున్నారని తెలిపారు. నిరుపేద గిరిజన కార్మికులు ఈ స్కీంలో పనిచేస్తున్నారని, 18 నెలల వేతనాలుగా వేతనాలు లేకపోవడంతో అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, కనీసం తినడానికి తిండి లేనటువంటి స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మెలోకి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసు, హైమా, బేబీ దేవి, చిరంజీవి, మంగ, వీరమణి, రాజ్యలక్ష్మి, రాజేశ్వరి, లక్ష్మిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

15న బహిరంగ సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -విఆర్.పురం

ఆదివాసీ అరణ్య ఘోష పేరుతో ఈనెల 15న రంపచోడవరంలో జరుగు బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని శ్రీరామగిరి పంచాయతీ చొక్కనపల్లి గ్రామంలో తోడం రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ గ్రామాలలో కొంతమందికి రాలేదని, కాంటూర్ లెక్కలు కాకి లెక్కలని పేర్కొన్నారు. గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ప్యాకేజీ ఇచ్చి, ఉపాధి కల్పించాలని, పోడు భూములు సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. పోలవరం పేరు చెప్పి గ్రామ అభివృద్ధి ఆపేశారని, మండలానికి 15 కిలోమీటర్లు ఉన్న గ్రామానికి రోడ్లు సరిగా లేక ఆటోలు, బైక్‌లు తిరగలేని పరిస్థితిని ఉందని, ఆస్పత్రికి వెళ్లాలన్నా చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను పోరాటాల ద్వారానే పరిష్కరించుకోవచ్చని, బహిరంగ సభకు గ్రామ ప్రజలు ఇంటికొక మనిషి కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు, గుండుపూడి లక్ష్మణరావు, శిరపు తాతబాబు, నలారపు ప్రకాష్‌రావు, మాజీ సర్పంచులు పులి సీతమ్మ, సోడి బూబామ్మ, దారయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్య నారాయణ

ఎమ్మెల్యేగా పోటీకి సిద్ధం

నైని సత్తిబాబు

ప్రజాశక్తి-హుకుంపేట:వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అవకాశం ఇస్తే అరకు నియోజకవర్గం లో ఎమ్మెల్యేగా పోటీకి సిద్ధం అన్ని నైని. సత్తిబాబు అన్నారు.మండల కేంద్రంలో గురువారం స్థానిక విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడారు.వైసీపీ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి పని చేస్తూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా యువజన విభాగం ప్రధానకార్యదర్శిగా పని చేస్తూ అరకు నియోజకవర్గం ఆరు మండలాల్లో ఉన్న క్యాడర్ తో మంచి సంబంధాలు కలిగి ఉన్నానన్నారు. పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థులకు అవగాహన కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కలిగించేలా కృషి చేస్తానన్నారు. ప్రతిపక్షంపై చేస్తున్న కుట్రాలకు తిప్పి కొట్టేందుకు నియోజకవర్గం స్థాయిలో గెలుపు గుర్రాలపై అధిష్టానం దృష్టి సారించి టికెట్ కేటాయిస్తే విజయం తధ్యమన్నారు. యువకులకు అవకాశం ఇస్తే 2024 ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలుపొందే అవకాశాలు ఉన్నాయన్నారు.

వంట పాత్రలు పంపిణీ

ప్రజాశక్తి -అనంతగిరి:రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన వంట పాత్రలను 160 ప్రాథమిక పాఠశాలలకు గురువారం స్థానిక ఎంపీపీ శెట్టి నీలవేణి చేతుల మీదుగా అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో విద్యా బోధనలు మరింత మెరుగు పరిచేందుకు అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. నాడు నేడు పథకం తో పాఠశాలల అభివృద్ధి వంటి ఎన్నో కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఏటిడబ్ల్యూఓ వెంకటరమణ, ఎంఈఓ బాలాజీ, భోజన నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పాత్రలు ఇస్తున్న ఎంపిపి

రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు గిరిజన విద్యార్థుల ఎంపిక

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నలుగురు విద్యార్థులు వీరే

ప్రజాశక్తి-చింతూరు

కాకినాడలో ఈ నెల11న జరిగిన ఎస్‌జిఎఫ్ఐ జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని అథ్లెటిక్ విభాగంలో చింతూరు మండలం విద్యానగరం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. యు.సీతారామ్ అండర్-17 విభాగంలో జావెలిన్ త్రోలో మొదటి స్థానం, కణితి వెంకటేష్ అండర్ -14 విభాగంలో షాటపుట్‌లో తృతీయ స్థానం, మడకం రాజు అండర్ -17 విభాగంలో షాట్‌పుట్‌లో తృతీయ స్థానం సాధించారు. వీరిని, వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు బి.వెంకటేష్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.చినబాబు, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ కే.సుజాత పాఠశాల సిబ్బంది పలువురు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో పాల్గొని జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

మారేడుమిల్లి : రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థి గొల్లోరి రవి ఎంపికయ్యాడు. ఈనెల 11న కాకినాడ జిల్లాలో జరిగిన జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సెలక్షన్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ఆశ్రమ బాలుర పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి గొల్లోరి రవి డిస్క్ త్రోలో మొదటి స్థానం, జావిలిన్ త్రోలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి క్రీడలకు అర్హత పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం రామారావు గురువారం తెలిపారు. జిల్లా స్థాయి ఆటోలో గెలుపొందిన రవిని, మంచి తర్ఫీదు ఇచ్చిన పిడి బి.దర్శన్, పీఈటి కే.ప్రసాద్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం రామారావు, హెచ్‌డబ్ల్యుఓ చిన్నారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

గొల్లోరి రవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



మెడల్స్ చూపుతున్న విద్యార్థులు

అథ్లెటిక్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

రంపచోడవరం : కాకినాడలో ఈనెల 11వ తేదీన జరిగిన నేషనల్ స్కూల్ గేమ్స్‌లో రంపచోడవరం ఎపి గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 400 మీటర్ల పరుగు పందెంలో పదవ తరగతి విద్యార్థి పి చరణ్ ప్రథమ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో చోడి అఖిల్ కుమార్ ద్వితీయ స్థానం, జంపింగ్‌లో కొమరం రాహుల్ ప్రథమ స్థానం సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ ఎస్కే అహ్మద్ అలీషా తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను గురువారం అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం ప్రసాద్, పిడి డి ప్రసాద్ రాజు, పిఈటి వి చిన్నయ్య, డ్రాయింగ్ ఉపాధ్యాయులు ఎర్రంశెట్టి ప్రశాంత్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎంపి వైద్యం నిలిపివేయడం సరికాదు

ప్రజాశక్తి- విఆర్.పురం

ఏజెన్సీ ప్రాంతంలో ఆర్ఎంపిల ప్రాథమిక వైద్యం ఎంతైనా అవసరమని, వారి వైద్యాన్ని అధికారులు నిలిపి వేయటం సరైన విధానం కాదని జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ అన్నారు. విఆర్.పురంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రభుత్వ వైద్య సేవలు ఉన్నా మూరుమూల ప్రాంతాల్లో వైద్యులు అందుబాటు లేవని, అలాంటి చోట్ల ఆర్ఎంపిలు కాలినడకన, సైకిల్స్, మోటార్ సైకిళ్లపైనా వెళ్లి ప్రాథమిక చికిత్స వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఊర్లలో నుంచి ఆసుపత్రికి రాలేని వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవాళ్లుఆర్ఎంపిల మీద ఆధారపడుతున్నారని చెప్పారు. అవకాశం ఉండి ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే గంటల పాటు లైన్లో నిలబడాల్సి వస్తుందని, పడుకోవడానికి నాలుగు బెడ్లు కూడా లేవని పేర్కొన్నారు. రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ ఎక్కడా లేని నిబంధనలు విఆర్.పురంలో కొత్తగా వచ్చాయా? అని ప్రశ్నించారు. గ్రామీణ వైద్యులకు జనసేన అండగా ఉంటుందని, ఈ సమస్యను పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కనుగుల శ్రీనివాస్ రెడ్డి, బాగుల ప్రమీల, మోహన్‌రెడ్డి, గంగాధర్, నాగేంద్ర, పోషిరెడ్డి మణికంత, అంజనరావు, సమ్మరాజు పాల్గొన్నారు.

రిసార్ట్స్ పేరిట సీఎం క్యాంపు కార్యాలయం : గంటా

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రిసార్ట్స్ పేరిట రుషికొండను బోడిగుండు చేసి సీఎం క్యాంపు కార్యాలయం కోసం సుమారు రూ.270 కోట్ల భారీ ఖర్చుతో విలాసవంతమైన భవనాల్ని శరవేగంతో నిర్మిస్తున్నారని మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అపాకపనేజ ఎంవిపి కాలనీలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రిసార్టు పనులు కోసం రెండు దశల్లో మొత్తం రూ.168.47 కోట్లు విడుదల చేశారని, లాండ్ స్కేపింగ్, కాంపౌండ్ వాల్, లైటింగ్‌కు రూ.8.58 కోట్లు, రోడ్లు, కాల్వలు, పార్కింగ్ సౌకర్యాలు కోసం రూ.16.40 కోట్లు, నీటి సరఫరా, విద్యుత్, మురుగునీటి సంబంధిత పనులకు రూ.29.80 కోట్లు ఇంటీరియర్, నిర్మాణాల ఆకృతుల కోసం రూ.19 కోట్లు, ఏపీ గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఆధ్వర్యాన 10 ఎకరాల్లో ల్యాండ్ స్కాపింగ్ కోసం రూ.4.20 కోట్లు, కంటైనర్ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు రూ.7 కోట్లు , 10 కి.మీ. పైగా భూగర్భ కేబుల్ ఏర్పాటుకు రూ.14.73 కోట్లు ఖర్చు చేసి ముఖ్యమంత్రి విలాస భవనం కట్టుకుంటున్నారని, ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం పోగొట్టడం అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. సీఎం కుటుంబానికి అత్యంత సన్నిహితులైన ఆర్కిటెక్చర్లతో భవన నిర్మాణాలకు సంబంధించిన ఇంటీరియర్ డిజైన్ల వరకు అన్ని పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఇందుకు ఏకంగా రూ.19 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ప్రాజెక్టు పేరుతో అనుమతులు తీసుకుని, అతి రహస్యంగా, అక్రమంగా ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించారని ఆరోపించారు. చంద్రబాబును జైల్లో పెట్టి జగన్ వికృతానందాన్ని పొందుతున్నారని విమర్శించారు.

నిన్నటిదాకా మా నమ్మకం నువ్వే జగన్ అని ప్రచారం చేశారు. ఇప్పుడు "వై ఏపీ నీడ్స్ జగన్" అనే కొత్త పల్లవి అందుకొన్నారని, వై ఏపీ నీడ్స్ జగన్.. దేనికోసం అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినందుకా? పోలవరం పూర్తి చేయనందుకా? రాజధాని నిర్మాణం చేపట్టనందుకా? ప్రత్యేక హోదా సాధించనందుకా? విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను అంగీకరించినందుకా? విశాఖకు రైల్వేజోన్ సాధించనందుకా? మద్యపాన నిషేధం కాస్తా ఏరులై పారిస్తునందుకా? ఇసుకను వ్యాపారంగా మార్చేసి ప్రజల నడ్డి విరుస్తునందుకా? యువతకు ఉద్యోగ కల్పన చేయనందుకా? రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ నేతల పట్ల కక్ష పూరిత రాజకీయాలకు పాల్పడినందుకా? రాష్ట్రం నుంచి పెట్టుబడుదారులను తరిమేసినందుకా? నిత్యావసరాల ధరలు పెంచినందుకా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి విజయ్ బాబు పాల్గొన్నారు.

ఎయును సందర్శించిన ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డాక్టర్ కె.బాబ్జి సందర్శించారు. ఈ సందర్భంగా ఎయు వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వీసీ ప్రసాదరెడ్డి వివరించారు. అనంతరం ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య డాక్టర్ కె.బాబ్జీ మాట్లాడుతూ, ఆంధ్రమెడికల్ కళాశాల విద్యార్థిగా ఉన్న సమయంలో ఏయూకు వచ్చిన సందర్భాలను గుర్తుచేసకున్నారు. అనంతరం డాక్టర్ బాబ్జీని ఎయు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. అనంతరం ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌ను ఆయన కార్యాలయంలో కలిసి అభినందించారు.

స్విమ్మింగ్ పూల్‌ను జివిఎంసి నడపాలి : సిపిఎం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆర్‌కె.బీచ్ రోడ్డులోని జివిఎంసి ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను మూడేళ్లకు లీజుకు ఇవ్వాలన్న జివిఎంసి నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. కోవిడ్ తరువాత స్విమ్మింగ్ పూల్ నిలిపివేసారని, రూ.2.5 కోట్ల ప్రజాధనంతో ఆధునీకరించి ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తులకు మూడేళ్లపాటు లీజుకివ్వడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికే ఎంవిపిలో రూ.25వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన స్పోర్ట్ ఎరీనాను ప్రైవేట్ వ్యక్తికి అప్పగించడం వల్ల అధిక ఫీజులు వసూలు చేసి కాంట్రాక్టర్ లాభపొందుతున్న విషయాన్ని గుర్తుచేశారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, స్విమింగ్ ఫూల్స్ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళిపోతే క్రీడాకారుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతుందని ఆవేదన వ్యక్తంచేశారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇటీవల మరణించిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామక పత్రాలను జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తన చాంబర్‌లో గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జివిఎంసి ఉన్నతికి ఎంతో కృషి చేసిన ఉద్యోగులు వివిధ ఆరోగ్య సమస్యలతో సర్వీస్‌లో ఉండగా అకాల మరణం పొందడంతో వారి కుటుంబాలను ఆదుకుంటున్నట్లు తెలిపారు.

సమస్యలపై ఎంపీ మాధవికి వినతి

ఎంపీ మాధవికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్, తదితరులు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధిలోని సమస్యలను అరుకు పార్లమెంటు సభ్యురాలు గొట్టేటి మాధవి దృష్టికి తీసుకెళ్లినట్లు దారకొండ సర్పంచ్ నడిగట్ల రాజు గురువారం వెల్లడించారు. దారకొండ పంచాయితీకి కళ్యాణ మండపం, సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయాలని, గుమ్మరేవులు, దుప్పిలివాడ పంచాయితీలకు నూతనంగా అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. దీనికి ఎంపీ మాధవి సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాడి రామన్న, వైసిపి బీసీ సెల్ అధ్యక్షుడు పిల్ల బుజ్జి, గుమ్మరేవుల సర్పంచి మురళి కమలమ్మ పాల్గొన్నారు.

బస్ షెల్టర్ అభివృద్ధికి నిధులు మంజూరుకు..

బస్ షెల్టర్ అభివద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ గొట్టేటి మాధవికి గురువారం సీలేరు సర్పంచ్ దుర్జో వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారని దుర్జో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దామనాపల్లి సర్పంచ్ కుంజేటి రామకృష్ణ, సీలేరు వైసీపీ కార్యకర్తలు వెంకట్రావు, గణేష్ ,బుజ్జి, రామస్వామి పాల్గొన్నారు

మరుగుదొడ్డి గొయ్యిలో పడిన మూగజీవి

- బయటకు తీసిన స్థానికులు

ప్రజాశక్తి -సీలేరు: శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్డి గొయ్యిలో మూగజీవి పడిపోగా, ఏపీ జెన్కో ఏఈ సురేష్ చొరవతో స్థానికులు బయటికి తీసి దాని ప్రాణాన్ని కాపాడి తమ ఉదారతను చాటుకున్నారు. జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధి ఏపీ జెన్కో కాలనీ 8వ క్రాస్ రోడ్డు అజీజ్ ఇంటి వెనుక భాగంలో మరుగుదొడ్డి గొయ్యి (చోకు పిట్) పైకప్పు శిథిలావస్థకు చేరుకొని ఉండగా, మూగ జీవి (ఆవు పడ్డ) మేత కోసం అటువైపు వెళ్లి ప్రమాదవ వాస్తు ఆ గొయ్యిలో పడిపోయింది. అజీజ్ తన ఇంటి వెనుక భాగంలో గొయ్యిలో ఉన్న ఆవుపడ్డను పడి ఉండటాన్ని గురువారం చూశారు.

వెంటనే ఏపీ జెన్కో ఎఇ సురేష్‌కు సమాచారం అందించారు. ఆయన స్పందించి కాంట్రాక్టర్ శ్యామ్ సన్, మరికొంతమంది సహాయంతో శత విధాల ప్రయత్నించి తాళ్ల సహాయంతో మూగజీవిని బయటికి తీసి ప్రాణాలు కాపాడారు. ఆ మూగజీవి బక్కచిక్కి ఉంది. అది నాలుగు రోజుల క్రితమే ఈ గొయ్యిలో పడి ఉంటుందని, బయటకు రావడానికి అవకాశంలేక, ఆహారం, నీరు లేక అలమటిస్తూ అందులో ఉండిపోయిందని స్థానికులు భావిస్తున్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరంలో అందని వైద్యసేవలు

- వైద్య పరీక్షలు చేయకుండానే వెళ్లిపోయిన వైద్యులు

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని వేములకొండ పంచాయతీలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యులు రోగులను పరీక్షించకుండానే మధ్యాహ్నం రెండు గంటలకే వెళ్లిపోయారని ఆ పంచాయతీ సర్పంచ్ కొమరం పండుదొర ఆరోపించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉందన్న సమాచారంతో చుట్టుపక్కల గ్రామాల నుండి సుమారు 150 మంది పేషెంట్లు ఓపీలు నమోదు చేసుకొని వైద్యం కోసం రాగా వారికి వైద్య సేవలు అందించకుండానే డాక్టర్లు వెళ్లిపోవడం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆకూరు ఎంపీటీసీ, సచివాలయ కన్వీనర్, గృహ సారధి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

పలు చోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి- యంత్రాంగం

డుంబ్రిగుడ:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగ పరుచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ఫాల్గుణ చెప్పారు. మండలంలోని గుంటగన్నేల పంచాయతీలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి విలువైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగనన్న ఈ ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు.గతంలో ఏ ప్రభుత్వం నిర్వహించని విధంగా వైసిపి ప్రభుత్వం ప్రతి ఒక్కరికి తమ ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తుందని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో 478 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బి ఈశ్వరి, జెడ్పిటిసి సిహెచ్ జానికమ్మ, వైద్యాధికారి పి.రాంబాబు, పీహెచ్ఎన్ మంజుల, హెల్త్ అసిస్టెంట్ కె.రవీంద్ర పాల్గొన్నారు.

గంటల తరబడి క్యూ లైన్ లో రోగులు

అనంతగిరి:మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా సచివాలయ కేంద్రంలో బొర్రా, కోనాపురం పంచాయతీల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, బొర్రా సర్పంచ్ జె.అప్పారావు, అప్పాలమ్మ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రెండు పంచాయతీల రోగులకు వేరు వేరేగా మెడికల్ క్యాంపులో ఏర్పాటు చేయవలసి ఉన్నప్పటికీ ఒకే చోట చేయడంతో రోగులు క్యూ లైన్ లో గంటల తరబడి వేసి చూడవలసిన పరిస్థితి ఎదురైంది. ఆసుపత్రులలో ఇచ్చే మందులు ఇచ్చారని రోగులు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హర్షిత్ రాజ్యం, తహాసిల్దార్ రాంభాయ్ పాల్గొన్నారు.

పెదబయలు:కుంతుర్ల పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్షను జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు కె బొంజుబాబు ప్రారంభించారు. బొంజుబాబు మాట్లాడుతూ, జగనన్న సురక్షను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్ పూర్ణయ్య, మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేశ్వర్‌రావు, ప్రత్యేక వైద్యాధికారులు నిఖిల్ కిరణ్ కుమార్, మండల విద్యాశాఖధికారి పుష్ప డేవిడ్, సూపర్ వైజర్స్ సింహాచలం, స్థానిక సర్పంచ్ కాసులమ్మ, ఎంపీటీసీ జ్యోతి, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు

క్యూలో నిలబడిన రోగులు

ఐటిడిఏ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులుగా రాజు, డొంబు

ఐటిడిఏ వర్కర్స్ యూనియన అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన రాజు, డొంబు

ప్రజాశక్తి-అరకులోయ:ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. ఐటిడిఏ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నూతన అధ్యక్షుడిగా డి.రాజు ఏకగ్రీవంగా ఎన్నికవ్వగా, కార్యదర్శిగా కె.డొంబు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు పాంగి. జగ్గారావు, సహాయ కార్యదర్శిగా స్వాభి రాంబాబు, కోశాధికారిగా ఎల్బీ.సింహాచలం, కమిటీ సభ్యులుగా తులసమ్మ, కుర్ర అప్పలస్వామి, సింహాచలం, శెట్టి సునీల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నాబ్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి : లోకనాథం

ప్రజాశక్తి -రాంబిల్లి : నేవల్ బేస్ నిర్వాసితుల సమస్యలను జిల్లా అధికారులు వెంటనే పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రభావతి డిమాండ్‌చేశారు. సిపిఎం రాంబిల్లి మండల సమావేశం గురువారం రుత్తల రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం, ప్రభావతి మాట్లాడుతూ, కొత్తపట్నం, వాడనర్సాపురం గ్రామాల మత్యకారులు చేపల వేటకు అవకాశం లేకుండా నేవీ లోపల పిషింగ్ బోట్లు బందించి అన్యాయం చేస్తున్నారని తెలిపారు. నాబ్ నిర్వాసితులు ఆందోళన సమయంలో ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చకపోవటం అన్యాయమన్నారు. దేశ రక్షణ కోసం భూములు, గ్రామాలు త్యాగం చేసిన నిర్వాసితులకు ప్రభుత్వాలు ఇంత అన్యాయం చేయడం తగదని మండి పడ్డారు. చినకళవలాపల్లి గ్రామ ప్రజలు 30 ఏళ్లుగా ఫారెస్టు భూముల్లో యూకలిప్టస్, కొబ్బరి, జీడి మామిడి చెట్లు పెంచుకుని జీవించినా వారికి ఎటువంటి నష్టపరిహారమూ ఇవ్వకుండా ప్రహరీ నిర్మిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామస్తులు వాడుకుంటున్న తాగునీటి బోర్లను కూడా లోపల వుంచి ప్రహరీ నిర్మిస్తున్నారని, వారికి తాగునీరు ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఈ ప్రహరీ వల్ల రైతులు వ్యవసాయ భూములుకు రోడ్డు సౌకర్యం కూడా పోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమస్యలను సత్వరమే పరిష్కరించకుంటే ప్రజలను, నిర్వాసిత మత్స్యకారులును, రైతులును చైతన్య పర్చి మరోసారి ఆందోళన చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.రాము, మండల కార్యదర్శి జి.దేముడునాయుడు, అచ్యుతాపురం పార్టీ నాయకులు కె.సోమునాయుడు, స్థానిక నాయకులు ఆర్.రాము, ఎన్.నారాయణరావు, సిహెచ్.నూకన్న, సిహెచ్.నూకరాజు, వై.రాము, సిహెచ్.రామకృష్ణ, ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.4 కోట్లతో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్

ప్రజాశక్తి -సీలేరు : గిరిజనుల ఉపాధే లక్ష్యంగా రూ.4 కోట్లతో డౌనూరులో కాఫీ ప్రాసెసింగ్ శుద్ధి యూనిట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని జిసిసి చింతపల్లి డివిజన్ మేనేజర్ పి.దేవరాజు వెల్లడించారు. జీకే వీధి మండలం సీలేరులో జిసిసి పెట్రోల్ బంకు, స్టోర్‌ను గురువారం ఆయన సందర్శించి తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది 1000 మెట్రిక్ టన్నులు కాఫీ కొనుగోలు చేయడానికి లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జిసిసి ఎమ్‌డి, ఎఫెక్ట్ కమిటీ గత ఏడాది కన్నా ఈ ఏడాది కాఫీ రైతులకు కేజీకి పది రూపాయలు పెంచేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. అయితే దీనిపై అధికారులు నుండి ఎటువంటి ఆదేశాలు తమకు ఇంకా రాలేదన్నారు. కాఫీ రైతుకు ఎకరాకు రూ.5000 నుంచి రూ.20 వేల వరకు రుణం మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నామని, సకాలంలో రుణాలు చెల్లించకుంటే రుణం మంజూరు చేయడం జరగదని పేర్కొన్నారు. టూరిజం ప్రదేశాలైన సీలేరు, దారాలమ్మ గుడి, లంబసింగి, బోదకొండమ్మ గుడి, వ్యూ పాయింట్ వద్ద స్టాల్స్ ఏర్పాటు చేసి జిసిసి ఉత్పత్తులు పర్యాటకులకు అందుబాటులో తీసుకొస్తామని తెలిపారు. సీలేరు ఏపీ జెన్కో పరిధిలో కో-ఆపరేటివ్ స్టోర్‌లో సూపర్ బజార్ పెట్టేందుకు అధికారులతో సంప్రదింపులు చేస్తామన్నారు. చింతపల్లి పెట్రోల్ బంకు సమీపంలో జిసిసి ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. డౌనూరు కాఫీ శుద్ధి యూనిట్ పనులు జనవరి, ఫిబ్రవరి నాటికి పూర్తయి అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీలేరు పెట్రోల్ బంకులో డీజిల్, పెట్రోల్ మూడు నాలుగు రోజులు కొరత ఏర్పడుతుందని సిబ్బంది పనితీరు బాగోలేదని ఫిర్యాదులు రావడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది సక్రమంగా పని చేయాలని లేకుంటే జీతంలో కోత విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిసిసి బ్రాంచ్ మేనేజర్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం నిలుపుదల అన్యాయం

అటశీశాఖ అధికారుల తీరుపై ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సిరిమల్లి రెడ్డి మండిపాటు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలోని వేటుకూరు పంచాయితీ పరిధి భీమవరం- అర్జునలోవ మధ్య జరుగుతున్న రోడ్డు నిర్మాణాన్ని ఫారెస్ట్ అధికారులు బుధవారం నుండి నిలుపుదల చేయడం అన్యాయమని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఇ.సిరిమల్లి రెడ్డి అన్నారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిలిచిపోయిన రోడ్డును గురువారం సిరిమల్లిరెడ్డి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నాళ్లకో కల నెరవేరుతుందని అనుకునే లోపే ఫారెస్ట్ అధికారులు వచ్చి గ్రావెల్ రోడ్డు నిర్మిస్తున్న భీమవరం, అర్జునలోవ గ్రామాల ప్రజలకు ఎటువంటి సమాచారం లేకుండానే పనులను నిలిపివేశారని తెలిపారు. పేరుకే రెవెన్యూ గ్రామమైన ఇప్పటికి ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇప్పుడు రోడ్డు వేస్తుంటే ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడం సరికాదని, ఫారెస్టు అధికారుల ఇబ్బందులు తొలగించాలని, తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

'చంద్రబాబుతో మేము' కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలం తామరపల్లి పంచాయతీలో తెలుగుదేశం పార్టీ నాయకులు బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ, వేములకొండ పంచాయతీ దార్లవలసలో బాబుతో మేము కరపత్రాలను గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ చంద్రబాబును ఎటువంటి ఆధారాలు లేకుండా వైసిపి ప్రభుత్వం కక్షపూర్వకంగా సిఐడి పోలీసులతో అరెస్టు చేయించిందని ఆరోపించారు. 30 రోజులు దాటిన కోర్టులో సరైన సాక్షాదారాలు సిఐడి వాళ్ల చూపించలేకపోయారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి మారాలని, లేకపోతే త్వరలో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కారం సురేష్ బాబు, సర్పంచ్ తెల్లం భద్రం, నాయకులు గోపి, నేరం వీరస్వామి, బూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నేతలు

వృక్ష శాస్త్రంలో చంద్రావతికి డాక్టరేట్

డాక్టరేట్ అందుకుంటున్న చంద్రావతి

ప్రజాశక్తి- కొయ్యూరు :అల్లూరి సీతారామరాజు జిల్లా, కొయ్యూరు మండలం, రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన దిబ్బ చంద్రావతికి వృక్ష శాస్త్రంలో ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. చంద్రావతి జిల్లాలోని ఆదిమ గిరిజన తెగలు ఉపయోగించే మందు మొక్కలు, నాగకేసరి చెట్ల నుంచి జీవ ఇంధనం అనే అంశంపై ఆచార్య ఎన్జీ పర్యవేక్షణలో పరిశోధన చేసి, ఈ అంశాలను జాతీయ, అంతర్జాతీయ పరిశోధన మేగజైన్లలో ప్రచురించారు.

ఇందుకు గాను ఎయు మంజూరు చేసిన డాక్టరేట్ పట్టాను ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాద్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా చంద్రావతికి ఆచార్యులు, పరిశోధకులు, మిత్రులు, కుటుంబ సభ్యులు, సిపిఎం నాయకులు ఎస్.సూరిబాబు అభినందనలు తెలియజేశారు.

వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -సీలేరు : వ్యాధుల పట్ల విద్యార్థుల అప్రమత్తంగా ఉండాలని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి సౌమ్య సూచించారు. జీకే వీధి మండలం బాలికల గిరిజన సంక్షేమ పాఠశాలలో గురువారం వ్యాధుల పట్ల వైద్యాధికారి సౌమ్య అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వ్యాపు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల విద్యార్థులకు వివరించారు. వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రత పాటించాలని, పాఠశాలలో ఉన్న చెత్తాచెదారాలు ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ జి 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.సురేష్, హెల్త్ సూపర్వైజర్ త్రినాథ్, ప్రధానోపాధ్యాయులు దేవామణి, వార్డెన్ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని స్థానిక ఫారెస్టు రేంజ్ అధికారి ఎం అబ్బాయి దొర అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణం, అడవులు, వన్యప్రాణులు అనే అంశాలపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఎనిమిదో తరగతి చదువుతున్న టి.హారిక, టి సిరివల్లి, కె.వీరలక్ష్మి, ఆర్ పూర్ణిమ మహేశ్వరి, 9, 10వ తరగతి చదువుతున్న వై.గుణశంకర్, ఎస్.లవ కుమారి, పి.భార్గవి, టి జ్యోతిలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గోపాలకృష్ణ, చిత్రలేఖనం ఉపాధ్యాయుడు ఎం కొండబాబు, ఎఫ్ఎస్ఓ డిఎస్ఎన్ మూర్తి, ఫారెస్ట్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా తుప్పల తొలగింపు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులోని ఏపీ జెన్కో ఉద్యోగుల నివాస కాలనీ, ఏపీ జెన్కో గెస్ట్ హౌస్‌కి వెళ్లే దారికి ఇరువైపులా, రెగ్యులేటరీ డ్యాం, మెయిన్ డ్యాం, రోడ్డుకు ఇరువైపులా తదితర ప్రదేశాల్లో తుప్పలు తొలగింపు కార్యక్రమం జోరుగా సాగుతోంది. జంగిల్ క్లియరెన్స్ పనులు 2019 వరకు ప్రతి ఏటా నిర్వహించేవారు. కరోనా, ఏపీ జెన్కోకు నిధులు కొరత కారణంగా తుప్పలు తొలగించే టెండర్ల ప్రక్రియ నిలిచిపోయింది. సుమారు నాలుగేళ్ల నుండి తుప్పలు తొలగింపు చేపట్టలేదు. తుప్పలు దట్టంగా పెరిగిపోవడంతో క్రిమి కీటకాలు పాములు సంచారం ఉంటుందని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ తుప్పలను తొలగించాలని ఏపీ జెన్కో ఉద్యోగులు, స్థానికులు జెన్కో ఎస్ఇ కెకెవి.ప్రశాంత్ కుమార్‌కు అనేక సార్లు విన్నవించారు. ఎట్టకేలకు ఆయన స్పందించి ఇటీవల టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి గుత్తేదారుడికి పనులు అప్పగించారు. ఈ మేరకు సీలేరు ఏపీ జెన్కో కోలనీ తదితర ప్రదేశాల్లో తుప్పలు తొలగించే కార్యక్రమాన్ని ఏఈ సురేష్ పర్యవేక్షణలో శరవేగంగా నిర్వహిస్తున్నారు. తుప్పలు తొలగించడం పట్ల జెన్కో ఉద్యోగులు, స్థానికులు, హర్షం వ్యక్తం చేశారు.

జగనన్న కాలనీల్లో ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణం చేయాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి: ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకు జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ప్రభుత్వమే చేసి లబ్ధిదారులకు అందించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. దేవీపట్నం మండలం, దేవారం గ్రామ పంచాయతీ పరిధి చిన్నారి గండి గ్రామంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుపేదలందరికీ ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పిందని, నాలుగున్నర సంవత్సరాల పూర్తి కావస్తున్న ఆదివాసీలకు ఒక్క జగనన్న కాలనీ ఇల్లు కట్టిన దాఖలు లేవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుర్రం తమ్మన్న దొర, తుర్రం అన్నారం, పండా బల్లియమ్మా, కారం చిన్న వెంకట లక్ష్మీ, మడి రామకృష్ణ, మడకం బూరమ్మా, కొమరం గౌరీ దొర పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం, ఆర్‌బికె ప్రారంభం

ప్రజాశక్తి-కొయ్యూరు :మండలంలోని బకులూరు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి గురువారం ప్రారంభించారు. అనంతరం అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, సర్పంచ్ పొట్టిక శ్రీను, ఎంపీటీసీలు బిడిజాన అప్పారావు, మల్లీశ్వరి, వైసిపి నాయకులు జల్లి బాబులు, బండి సుధాకర్, గాడి నాగమణి, రేగటి ముసిలినాయుడు, గాడి సత్యనారాయణ, సత్యవతి, సర్పంచులు కొడ రాజుబాబు, సుర్ల చంద్రరావు, రాజుకుమారి, నీలపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో అట్టహసంగా 'గుసాక్ కార్నివాల్'

ప్రజాశక్తి- విశాఖపట్నం : గీతం సైన్ యాక్టివిటీ సెంటర్ (గుసాక్) ఆధ్వర్యంలో విద్యార్థుల సాంకేతిక యువజనోత్సవం వందలాదిమంది విద్యార్థుల సమక్షంలో గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో అట్టహాసంగా ప్రారంభమైంది. రెండు రోజులపాటు నిర్వహించే ఈ యువజన సాంకేతిక ఉత్సవాన్ని గీతం ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొపెసర్ వై. గౌతమ్‌రావు గురువారం ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు సాంకేతిక అంశాలపై వర్క్‌షాప్‌లను అలాగే విద్యార్థులు రూపొందించిన సాంకేతిక నమూనాలతో కూడిన ప్రదర్శనలను, సాంస్కతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్గతంగా ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీయడానికి ఈ తరహా యువజనోత్సవాలు దోహదపడతాయన్నారు. గుసాక్ కార్నివాల్ పేరిట పదేళ్లుగా నిర్వహిస్తున్న ఈ సాంకేతిక యువజనోత్సవం ఎందరో భావిభారత పౌరులను, పారిశ్రామికవేత్తలను దేశానికి అందించిందన్నారు. విద్యార్థులు తమలోని సృజనాత్మకతను వెలికి తీసి నూతన ఆవిష్కరణలకు ఊపిరి పోయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతోపాటు సమకాలీన అంశాలపై అవగాహన, సాంకేతిక మేనేజ్మెంట్ అంశాలలో, శాస్త్ర విజ్ఞాన ప్రగతిలో జరుగుతున్న అభివృద్ధిపై ప్రతి విద్యార్థి పట్టు సాధించాలని కోరారు. యువజనోత్సవాలతో గీతం వర్సిటీ ఆవరణలో పండుగ వాతావరణం సంతరించుకుంది. సంప్రదాయ దుస్తులతో విద్యార్థుల ఫ్యాషన్ షో నిర్వహించారు. వివిధ సాంకేతిక నమూనాలను ప్రదర్శించారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీ తదితర అంశాలపై నిపుణుల పర్యవేక్షణలో వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేశారు. అనంతరం సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థుల సందడి అంబరాన్ని తాకింది. శాస్త్రీయ పాశ్చాత్య సంగీతాలతో నృత్యాలతో విద్యార్థులు అలరించారు.

నేరాలు ఘోరాలు

21 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మోటార్ సైకిల్‌పై తరలిస్తున్న 21 కేజీల గంజాయిని రాజవొమ్మంగి సిఐ ఆధ్వర్యాన పోలీసులు గురువారం స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... జడ్డంగి ఎస్ఐ రఘునాధరావుకి అందిన సమాచారం మేరకు రాజవొమ్మంగి డిప్యూటీ తహశీల్దార్ అల్లి సత్యనారాయణ, పోలీసులు . నర్సిపట్నం-ఏలేశ్వరం ప్రధాన రహదారిపై జడ్డంగి మల్లికార్జున స్వామి ఆలయ ముఖ ద్వారం ఎదురుగా కల్వర్ట్ వద్ద గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వస్తున్న ఎపి 39 ఎఫ్ఎన్ 4345 నెంబర్ గల మోటార్ సైకిల్‌ని తనిఖీ చేశారు. అందులో 21 కేజీల గంజాయిని గుర్తించారు. దీంతో గంజాయి తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం చిత్రకొండ మండలం గుంతవాక గ్రామానికి చెందిన బిత్తరి బాబు, మలికిపురం గ్రామానికి చెందిన గొబ్బుల సాయికిరణ్‌ను అరెస్టు చేసి, వారి నుండి 21 కేజీల గంజాయి, మోటార్ సైకిల్, రెండు సెల్‌ఫోన్‌లు, రూ.300 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అడ్డతీగల జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించినట్లు జడ్డంగి ఎస్ఐ రఘునాధరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వీఆర్వో నానాజీ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ల పంచాయతీ, పిట్టలపాడు గ్రామంలో గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు నిందితులను మంప పోలీసులు అరెస్టు చేసి ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... పిట్టలపాడు గ్రామానికి చెందిన మర్రి నాగరాజు, గెమ్మిలి వెంకటేష్ కుటుంబ పోషణ కష్టమై తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో గంజాయి పంట సాగు చేపట్టారు.

మర్రి నాగరాజుకు చెందిన భూమిలో 100 గంజాయి మొక్కలు నాటి సాగు చేపట్టారు. గెమ్మిలి వెంకటేశ్ సాగు చేయుటకు అప్పుడప్పుడు సహాయం చేసేవాడు. ఈ విధంగా ఇద్దరు నిందితులు గంజాయి తోటలో మొక్కలకు నీళ్ల వేస్తుండగా, పోలీసులు దాడి చేశారు. పోలీసులను చూసిన ఇద్దరు పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు వారిని పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం చింతపల్లి కోర్టు తరలించినట్లు మంప పోలీసులు తెలిపారు.